ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో బొడ్రాయి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపనం, అఖండ దీపారాధన, నాభిశిల విగ్రహం ఊరేగింపు, నాభిశిల అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రొఫెసర్ రవికుమార్‌కు డాక్టరేట్



కీసర: బోగారంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్‌కు కంప్యూటర్‌సైన్స్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ బీవీ.రమణమూర్తి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేసి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు రవికుమార్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ప్రొఫెసర్ రవికుమార్‌ను సత్కరించి అభినందించారు.

రోడ్డుకు ఇన్‌స్పెక్టర్ మరమ్మతులు



మేడ్చల్: అధ్వాన్నంగా ఉన్న మేడ్చల్–కిష్టాపూర్ రహదారిని మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ దాతల సాయంతో మరమ్మతులు చేయించారు. ఆర్‌ఎంసీ ప్లాంట్ల సహకారంతో గుంతల్లో వెట్‌మిక్స్, కాంక్రీట్ వేయించి చదును చేయించి గుంతలను పూడ్చారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి కిష్టాపూర్ గ్రామం వరకు ఉన్న రోడ్డులో మోకాల్లోతు గుంతలు పడటం, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో ఇన్‌స్పెక్టర్ మరమ్మతులు చేయించారు.

ప్రొసిడింగ్ పత్రాల పంపిణీ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి జ్ఞానాపూర్ వార్డులోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మున్సిపల్ అధికారులు, నాయకులు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. వార్డు ఆఫీసర్లు హరీశ్, సాయి, సతీష్, నాయకులు అలెగ్జాండర్, మరీలు, అంతోనమ్మ, ఫిలిప్స్ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కుమార్తె అదృశ్యం

పోచారం: తల్లి మందలించిందని మనస్తాపంతో కుమార్తె ఇంటి నుంచి అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడ సమీపంలోని పకీర్‌టెక్యా తండాకు చెందిన ధీరావత్ రేణుక, శంకర్ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా పెద్ద కుమార్తె ధీరావత్ దీపిక (19) వారం క్రితం అఖిల్ అనే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతుందని, తల్లి మందలించింది. బుధవారం మధ్యాహ్నం కిరాణా దుకాణానికి వెళ్లిన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో తల్లి రేణుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ భరోసా సెంటర్ సందర్శన



మేడ్చల్: మేడ్చల్‌లోని భరోసా సెంటర్‌ను జార్ఖండ్‌కు చెందిన సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ కిరణ్‌కుమారి పసి, డీఐజీ సంధ్యారాణి వారి బృందం భరోసా సెంటర్‌ను సందర్శించారు. భరోసా సెంటర్ నిర్వహణ, సెంటర్ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మేడ్చల్ డివిజన్ పోలీసులతో సమావేశమై సెంటర్ గురించి వివరాలు అడిగారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, ఉమెన్ సెఫ్టీ డీఎస్పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలేది మూడే !

- మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లాలో కనుమరుగు కానున్న మున్సిపాలిటీలు
- జీహెచ్‌ఎంసీ వైపు 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు
- 7 మున్సిపాలిటీల్లో కనిపించని వార్డుల విభజన



మేడ్చల్: హైదరాబాద్ మహనగర విస్తరణలో భాగంగా మేడ్చల్ జిల్లాలో స్థానిక సంస్థలు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయి. మేడ్చల్ జిల్లా దేశంలోనే విభిన్న జిల్లాగా ఉండేది. ప్రస్తుతం మారుతున్న సమీకరణాలతో జిల్లా స్వరూపం మొత్తంగా మారనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ మహనగర విస్తరణ చేయాలనే ఆలోచనలు చేయడంతో హైదరాబాద్‌కు శివారులో ఉన్న మేడ్చల్–మల్కాజ్‌గిరిజిల్లా రూపురేఖలు మారుతున్నాయి.

3 మినహా.. అంతా జీహెచ్‌ఎంసీనే..

ప్రభుత్వం మేడ్చల్ నియోజకవర్గంలో ఉన్న మూడు నూతన మున్సిపాలిటీలను నూతనంగా ఏర్పాటు చేసి, 61 గ్రామాల్లో మిగిలిన గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేశాయి. తాజాగా ప్రభుత్వం నూతన మున్సిపాలిటీలలో వార్డుల విభజనపై దృష్టి పెట్టగా.. విలీన గ్రామాలపై ఎలాంటి విభజన చేయడం లేదు. మున్సిపాలిటీలలో గ్రామాలు ఇప్పటికే విలీనంకావడంతో వార్డు సంఖ్య మారాల్సి ఉండగా.. కేవలం మూడు చింతలపల్లి, ఎల్లంపేట, అలియాబాద్‌లలో మత్రమే వార్డుల విభజన చేస్తున్నారు. మిగతా 7 మున్సిపాలిటీలలో ఎలాంటి వార్డుల విభజన చేయడం లేదు. నూతన మున్సిపాలిటీల్లో మాత్రమే వార్డు కుదింపు చేస్తూ.. మిగతా మున్సిపాలిటీలలో చేయకపోవడంతో 3 మున్సిపాలిటీలు మినహా అన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం అవుతున్నట్లు స్పష్టమౌతుంది.

గతంలో అన్ని పాలనలు..

మేడ్చల్ జిల్లా పదేళ్ల క్రితం ఏర్పడిన సమయంలో జిల్లాలో 61 గ్రామపంచాయతీలు, 5 మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్, 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడం, నూతనంగా 3 మున్సిపాటీలను ఏర్పాటు చేయడంతో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు కనుమరుగయ్యాయి. దీంతో మేడ్చల్ అర్బన్ జిల్లాగా మారిపోయింది.

12 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు..

నియోజకవర్గంలో మేడ్చల్, తూంకుంట, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఎల్లంపేట్, మూడు చింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలు జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, కార్పొరేషన్లు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, నిజాంపేట్ కార్పొరేషన్లు ఉన్నాయి. మొత్తంగా జిల్లాలో 12 మున్సిపాలిటీలు 4 మున్సిపల్ కార్పొరేషన్లు ప్రస్తుతానికి ఉన్నాయి.

పట్టణాల స్థాయికి..

మేడ్చల్, తూంకుంట, ఘట్‌కేసర్, మున్సిపాలిటీలు మాత్రమే నగరానికి కొద్ది దూరంగా ఉండగా.. మిగతా మున్సిపాలిటీలు రాజధాని నగరంలో అంతర్భాగంగా ఉన్నాయి. పట్టణ వాతావరణంలోనే ఉన్నాయి. పోచారం, కొంపల్లి, దుండిగల్ గుండ్లపోచంపల్లి, నాగారం, దమ్మాయిగూడ పూర్తిగా పట్టణాలుగా ఉన్నాయి. బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్‌లు నగర స్థాయికి ఎప్పుడో వెళ్లిపోయాయి. భవిష్యత్తులో మేడ్చల్ కేవలం అర్బన్ జిల్లాగానే ఉండిపోనుంది. కేవలం రెవెన్యూ మండలాలకే పరిమితం కానుంది.

9 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీలోకి..

జిల్లాలోని 9 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం స్పష్టమవుతుండటంతో మేడ్చల్ నియోజకవర్గంలోని నూతన మున్సిపాలిటీలు అలియాబాద్, ఎల్లంపేట్, మూడు చింతలపల్లిలు మాత్రమే జిల్లాలో మిగలనున్నాయి. జిల్లాలోని దుండిగల్, కొంపల్లి, మేడ్చల్ ,తూంకుంట, గుండ్లపోచంపల్లి, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీ ఎన్నికల నాటికి విలీనం కావడం తథ్యంగా కనబడుతుంది. ఒకప్పుడు గ్రామాలతో అందంగా ఉండే మేడ్చల్.. నేడు కాంక్రీట్ జంగిల్‌తో నగరమయంగా మారడంతో అర్బన్ ప్రాంతంగా మారింది. పట్టణీకరణలో భాగంగా మేడ్చల్ మొత్తం రాజధాని నగరంలో అంతర్భాగం కావడం ఖాయంగా కనిపిస్తుంది.

సమస్యలను సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్: నూతన చట్టం భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించి వారి సమస్యలను తెలుసుకోవడానికి నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి సోమారంలో బుధవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. రైతుల సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారం కోసం అధికారులు అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సదస్సుల నిర్వహణ వల్ల రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సునీల్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తులు పరిశీలిస్తున్న నాయబ్ తహసీల్దార్

ఘట్‌కేసర్: భూ సమస్యల పరిష్కారానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని నాయబ్ తహసీల్దార్ రాజేందర్ అన్నారు. బుధవారం కొండాపూర్‌లో నిర్వహించిన రైతు సదస్సులో మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్యతో కలిసి రైతుల నుంచి 25 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు తమ గ్రామాలకు వచ్చి భూ సమస్యలు పరిష్కరిస్తారన్నారు. భూ రికార్డుల్లో మార్పులు, విస్తీర్ణం, ముద్రణలో తప్పులు దొర్లితే సరిచేసుకోవాలని సూచించారు. లక్ష్మారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఆంజనేయలుయాదవ్, నాగరాజుముదిరాజ్, రమేష్, వెంకటేష్, శేఖర్, రాజిరెడ్డి, రాంరెడ్డి, రవీందర్, శ్రీనివాస్, లింగం, మహేష్, సుధాకర్, నాగులు, యాదగిరి, స్వామి, వెంకట్, వినోద్, నర్సింహ్మ పాల్గొన్నారు.

అనుమానం వస్తే సమాచారం ఇవ్వండి !

ఘట్‌కేసర్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



బస్సులో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ పరశురాం

ఘట్‌కేసర్: కొత్త వ్యక్తుల కదలికలపై అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ పరశురాం అన్నారు. రాచకొండ సీపీ ఆదేశానుసారం బుధవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, దేవాలయం, మజీద్, ఆర్టీసీబస్సులు, షాపింగ్‌మాల్స్, మార్ట్‌లను డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టామని వివరించారు.

సిమెంట్‌లో తిరుగు లేని సంస్థగా భారతీ సిమెంట్

తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్‌ల అందజేత



మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహేర్ అన్నారు. పీర్జాదిగూడ శ్రీలక్ష్మీగణపతి ట్రేడర్స్, డీలర్ షాపులో తాపీమేస్త్రీల సమావేశం నిర్వహించారు. బుధవారం ఒక్కొక్కరికి రూ.1లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్‌లు, సైటు వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్ రూ.20 అధికంగా ఉంటుందని పేర్కొన్నారు.

'కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతా'..



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక యూనియన్ సభ్యులు

రామంతాపూర్ : తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్, గృహ కార్మికుల యూనియన్ సభ్యులు బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఇళ్లలో పనిచేసే గృహ కార్మికులకు కనీస వేతనాల చట్టం పరిధిలోకి తీసుకురావాలని, అదే విధంగా వారి ఆరోగ్యభద్రతకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల సానుకూలంగా స్పందిస్తూ.. ఇళ్లలో పనిచేసే గృహ కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈనెల 16న రామంతాపూర్‌లో జరిగే గృహ కార్మికుల దినోత్సవంలో పాల్గొంటానని ఆయన హామీ ఇచ్చారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా



స్నాతకోత్సవంలో పట్టాలు అందజేస్తున్న శ్రీకాంత్ సిన్హా

ఘట్‌కేసర్: విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన స్నాతకోత్సవం (గ్రాడ్యుయేషన్ డే) వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐఐటీలతో కలిసి నిర్వహిస్తున్న కృత్రిమమేధస్సు (ఏఐ) సమ్మర్ ఇంటర్న్‌షిప్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ లేని క్యాంపస్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. వేల్పూరి చక్రవర్తి, సంస్కృతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శివకేశవరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



జవహర్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వసంత

జవహర్‌నగర్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ వసంత అన్నారు. 100 రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో కమిషనర్ వసంత, మహిళా సంఘాలతో కలిసి అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణ, వర్షాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యల నివారణపై అవగాహన కల్పించారు. డీఈ మాధవచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, ఎన్వీరాన్‌మెంట్ ఇంజినీర్ సందీప్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇల్లు'తో సొంతింటి కల సాకారం



ఇందిరమ్మ ఇంటి పట్టాలు అందజేస్తున్న అధికారులు, కాంగ్రెస్ నేతలు

మేడ్చల్ : సమాజంలో నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం కలలు కన్నారేగానీ.. గత ప్రభుత్వం ఏనాడు నెరవేర్చలేదని, మేడ్చల్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ లబ్ధిదారుల సమావేశంలో ఆమె పాల్గొని ఇళ్ల పట్టాలు అందజేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల కలలను సాకారం చేయడానికి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారన్నారు. మున్సిపల్ అధికారులు, హౌజింగ్ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి, వారి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించాలని కోరారు. కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చాపరాజు, నరేందర్, దేవ, మహేష్, మధుకర్, సత్యనారాయణ, రంజిత్, పి.మహేష్ , అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొర్రెముల్‌లో 68 అర్జీల స్వీకరణ



రెవెన్యూ సదస్సులో అధికారులు

పోచారం: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ మండల తహసీల్దారు డీఎస్ రజిని కోరారు. బుధవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ప్రజలు భూ సమస్యలపై రెవెన్యూ అధికారులకు అర్జీలను అందజేయాలన్నారు. ముఖ్యంగా పీఓబీ తొలగింపు, మ్యుటేషన్లు, విస్తీర్ణ సవరణలపై మొత్తం 68 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య, ఆర్ఐ కావ్యరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సురూటును పునరుద్ధరించాలి వినతి

మేడ్చల్: మేడ్చల్ నుంచి రాయిలాపూర్ గిర్మాపూర్‌లకు నిలిపేసిన బస్సులను తిరిగి పునరుద్ధరించాలని కాంగ్రెస్ నేతలు మేడ్చల్ ఆర్టీసీ డీఎంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గిర్మాపూర్, రాయిలాపూర్‌కు మేడ్చల్ నుంచి గతంలో బస్సులు నడిచేవని, మేడ్చల్‌లో రైల్వే బ్రిడ్జి నిర్మాణం కారణంగా రద్దు చేశారన్నారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడం , రాకపోకలు సాగుతుండటంతో బస్సులను తిరిగి ప్రారంభించాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యం కోసం 2 గ్రామాలకు బస్సులను పునరుద్ధరించాలని కాంగ్రెస్ నాయకులు డీఎం సుధాకర్‌ను కోరారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, చంద్రయ్యగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

రైతు సమస్యలు తీర్చడమే రెవెన్యూ సదస్సు లక్ష్యం

శామీర్‌పేట్: రైతుల సమస్యలను తీర్చడమే రెవెన్యూ సదస్సు లక్ష్యమని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల రెవెన్యూ పరిధిలో తహసీల్దారులు యాదగిరిరెడ్డి, వెంకటనరసింహారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన లభించిందన్నారు. శామీర్‌పేట మండలంలో ముందాయిపల్లి 7, అంతాయిపల్లిలో 17, మొత్తం 24 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

◆ మూడుచింతలపల్లి మండల పరిధిలోని పోతారంలో 8, కేశవాపూర్‌లో 49, యాకత్‌పూర్‌లో 17, మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయని, తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి తెలిపారు. రైతులు సమర్పించిన పిర్యాదులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

డంపింగ్‌యార్డును తొలగించాలని వినతి


పోచారం: అన్నోజిగూడలోని ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డికి యానంపేట్ ప్రాంతానికి చెందిన పాలకూర పోశెట్టి బుధవారం వినతి పత్రం అందజేశారు. డంపింగ్‌యార్డు వల్ల పక్కనే ఉన్న పొలాల్లోకి ప్లాస్టిక్ కవర్లు, చెత్తా,చెదారం చేరుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో భూములతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. రహదారి పక్కనే డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయడంతో దుర్వాసన వ్యాపిస్తోందని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా డంపింగ్‌యార్డును నివాసప్రాంతాలకు దూరంగా తరలించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

వేర్వేరు ఘటనల్లో..

గుర్తు తెలియని మృతదేహాల స్వాధీనం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం పట్టాలపై పడిఉందనే సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బుధవారం ఉదయం రైలు నుంచి కిందపడ్డాడా.. లేదా పట్టాలు పక్క నుంచి గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు. వివరాలకు 9440083160.

మరో చోట..



ఘట్‌కేసర్: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ టిఫిన్ సెంటర్ ఎదురుగా 60 ఏళ్లున్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. వివరాలు తెలిసిన వారు 8712662705.

సమీక్షలు ఉండవు.. పర్యవేక్షణ కరువు

- జీహెచ్‌ఎంసీ తీరుపై ఎమ్మెల్యే మండిపాటు..
- కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై నియోజకవర్గ సమస్యలపై బుధవారం నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే బోర్డు సెప్టెంబర్, 2022లో తీర్మానం చేసుకుని రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు ఆర్‌యూబీల నిర్మాణం కోసం 100 శాతం నిధులు ఇస్తామని ఎన్‌వోసీలు తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకు సంబంధిత శాఖల నుంచి ఎలాంటి సమాధానాలు రాలేదని, వివరాలు సరిగ్గా లేకపోవడంతో ఆ ఫైల్‌ను వెనకకు పంపిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని పలు వార్డు కార్యాలయాల్లో తాళాలు వేసి, నిరుపయోగంగా ఉన్న వార్డు కార్యాలయాలను కమ్యూనిటీహాల్‌గా స్థానిక కాలనీవాసులకు ఉపయోగపడేలా చూడాలన్నారు.

◆ మచ్చబొల్లారం డివిజన్‌లోని సర్వేనెంబర్–198, 199లోని హిందూశ్మశానవాటికలో రెండెకరాల్లో డంపింగ్‌యార్డు నిర్మించి రాంకీ సంస్థకు అప్పగించారని, స్థానిక డిప్యూటీ కమిషనర్ రెండెకరాల స్థలం డంపింగ్‌యార్డుకు కేటాయించారన్నారు. స్థానిక ఎమ్మార్వో అది హిందూ శ్మశానవాటిక స్థలమని చెబుతున్నారన్నారు. ఈ శ్మశానవాటికను పరిరక్షించాలని కోరారు.

◆ మల్కాజిగిరి డివిజన్ సఫిల్‌గూడలోని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం వద్ద చెక్‌డ్యామ్ కట్టేటప్పుడు సిల్ట్ తీయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

◆ పారిశుద్ధ్య కార్మికుల కొరతతో మల్కాజిగిరి నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా జరగడం లేదని, ఈ విషయం ఏఎంహెచ్‌వోల దృష్టికి తీసుకెళ్లినా కార్మికుల సిబ్బంది కొరత ఉందన్నారు. దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి నూతన ప్రతిపాదనలు ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అందజేశారు.